గోపిమూర్తి విజయానికి ప్రచారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తిని గెలిపించాలని కోరుతూ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యాపకులు ప్రచారాన్ని నిర్వహించింది. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖరతోపాటు, ఇతర అధ్యాపకులను కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు గొర్ల మాణిక్యం, శేషగిరి ఆధ్వర్యంలో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో అధ్యాపకులు క్రోతు బాబ్జి, వాగు మాధవ్, ఒలుపు కనకరాజు, పలివెల శివాజీ, అనిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల వద్ద ప్రచారం

పడకేసిన పారిశుధ్యం..!

- సక్రమంగా జరగని చెత్త సేకరణ
- తడి, పొడి చెత్తపై చూపే లేదు
- మరమ్మతుల సమస్యతో యంత్రాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ స్మార్ట్ సిటీలో పారిశుధ్య పడకేసింది. గత 24 రోజులుగా బకాయి వేతనాలు చెల్లించాలని క్లాప్ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం అరకొరగానే సాగుతోంది. 31.69 చ.కిమీగా విస్తరించి ఉన్న కాకినాడ స్మార్ట్ సిటీలో సుమారు 4 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రణాళి కాబద్ధంగా నిర్మించిన నగరంగా, పింఛనుదారుల స్వర్గధామంగా పేరున్న కాకినాడలో ప్రస్తుతం పారిశుధ్యం అధ్వానంగా మారింది. నగరంలో దాదాపుగా 100 మురికి వాడలు ఉండగా 300 కిలోమీటర్ల మేర మురుగు నీటి కాలువలు ఉన్నాయి. రోజుకి సుమారు 240 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది.

సక్రమంగా జరగని చెత్త సేకరణ

పారిశుధ్యం మెరుగు పర్చేందుకు, ప్రజారోగ్య పరిరక్షణకు అనేక కార్యక్రమాలు జరుపుతున్నా ఎక్కడికక్కడ చెత్త దర్శనమిస్తోంది. గతంలో ఇంటింటా చెత్త సేకరణకు బుట్టలు పంపిణీ చేశారు. తడి, పొడి, హానికర వ్యర్థాలను వేరుచేసి ఇవ్వాలని సూచించారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం, తగినంత మంది పారిశుధ్య సిబ్బంది లేకపోవడం తదితర కారణాలతో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటోందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం క్లాప్ డ్రైవర్లు తమ బకాయి జీతాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టిన నేపథ్యంలో తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా సక్రమంగా జరగడం లేదు. చెత్త సేకరణకు ఉపయోగిస్తున్న పలు వాహనాలు మరమ్మతులు గురై సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మరోవైపు డంపింగ్ యార్డ్‌లో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయి. చెత్తను తరలించే సందర్భంలో దారి మార్గం ఇబ్బందులకు గురిచేస్తుండడం వలన గంటల తరబడి వాహనాలు యార్డ్ వద్ద నిలిచిపోతున్నాయి. వర్షం వచ్చినప్పుడు పరిస్థితులు మరీ దారుణంగా ఉంటున్నాయి.

పాత బస్టాండు వద్ద పేరుకుపోయిన చెత్త

అదనపు భారంతో సిబ్బంది అవస్థలు

పారిశుధ్య విభాగంలో నెలకున్న పలు సమస్యల వలన ఉన్న సిబ్బందిపైనే అదనపు భారం పడుతుంది. ఈ విభాగంలో 1092 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 402 మంది రెగ్యులర్ కార్మికులు కాగా 690 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. మరో 100 మంది రోజూ వారీ కార్మికు లున్నారు. 14 సర్కిళ్ళు, ఒక నైట్ సర్కిల్ పరిధిలో వీరంతా పని చేస్తున్నారు. వాస్తవానికి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెత్త ఉత్పత్తి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో 2 వేల మంది సిబ్బంది అవసరం ఉంది. కానీ తగిన శానిటేషన్ వర్కర్లు లేకపోవడంతో ఉన్నవారిపై అదనపు భారం, తీవ్ర ఒత్తిళ్లు, తప్పడం లేదు. డ్రైవర్స్ కాలనీ, తూరంగి సీతారామ నగర్ ప్రాంతాలతో పాటుగా జగన్నాధపురం, జె.రామారావుపేట తదితర ఏరియాలు ముంపు బారిన పడి తరచూ పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పారిశుధ్య విభాగాన్ని మెరుగుపర్చాల్సివుంది.

సిబ్బంది సంఖ్యను పెంచాలి

3 నెలల బకాయి జీతాల గురించి గత 23 రోజులుగా కాకినాడ నగరపాలక సంస్థ క్లాప్ వాహన డ్రైవర్స్ సమ్మె చేస్తున్నారు. నగర పాలక సంస్థ రూ. 30 లక్షలు సిడిఎంఎకు పంపినా డ్రైవర్లకు జీతాలు జమ కాలేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమ్మె పరిష్కారం చేయాలి. కాంపాక్టర్స్, ట్రాక్టర్స్ డ్రైవర్స్‌పై పని భారం పెరుగుతుంది. రాత్రి పూట పని చేయించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మరొక ప్రక్క డంపింగ్ యార్డ్‌లో వాహనాలు దిగబడి పోతున్నాయి. శానిటేషన్ వాహనాలకు మరమ్మతులు సకాలంలో సక్రమంగా చేయించడం లేదు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నగరం శానిటేషన్ మెరుగుదలకు సిబ్బంది సంఖ్యను పెంచాలి. స్పెషల్ శానిటేషన్ వర్కర్స్, డ్రైవర్స్ కు 6 నెలల పైగా జీతాలు బకాయి ఉన్నాయి.

-పలివెల వీరబాబు, సిపిఎం నగర కన్వీనర్

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

ఒప్పందం మేరకు జిఒలు ఇవ్వాలి

ఆశా కార్యకర్తల ధర్నాలో నేతల డిమాండ్ -జెడ్‌పి సెంటర్ వరకూ ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం తక్షణమే జిఒలు, సర్క్యులర్లను విడుదల చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశ కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అనంతరం జిల్లా పరిషత్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ మాట్లాడారు. ఎన్నికల ముందు తమ సమస్యల పరిష్కారం కోసం ఆశ కార్యకర్తలు చేపట్టిన నిరసన శిబిరాలకు కూటమి నాయకులు వచ్చి మద్దతు తెలిపారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తామని హామీలు గుప్పించారని అన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావస్తున్న ఏ ఒక్క ఆశా కార్యకర్త సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. ఆరు నెలల కాలంలో నిత్యవసరాలు సరుకులు విపరీతంగా పెరిగాయని, విద్యుత్ ఛార్జీలను పెంపుదల చేశారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఆశాలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒప్పందంలో భాగంగా రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.60 వేలు జీవో విడుదల చేయాలని, సర్వీసులో చనిపోయిన ఆశ కార్యకర్త కుటుంబానికి ఇన్సూరెన్స్ వర్తింపజేస్తూ ఆదేశాలు ఇవ్వాలని, ఆన్‌లైన్, సర్వేల పేరుతో ఆశలపై మోపుతున్న పని భారాన్ని తగ్గించాలని, రికార్డు బుక్కులు ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నగర కార్యదర్శి జ్యోతి, జిల్లా కోసాధికారి రమణమ్మ, అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగుల సంఘం నాయకులు నాయుడు, రాజారావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి నొక్కు లలిత, రాయిడు నాగలక్ష్మి, మడికి లక్ష్మీ, వల్లూరి ఉమావతి, ఉమాదేవి, మీనాక్షి, గంగా భవాని, మంగారత్నం, పిహెచ్. వెంకటలక్ష్మీ, మౌనిక పాల్గొన్నారు.

విమానాశ్రయం వద్దే..వద్దు...

ప్రజాశక్తి - తొండంగి

తమ ప్రాంతంలో విమానాశ్రయం వద్దని పలువురు రైతులు కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని దొండపూడిలో హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హజరై తిరిగి వెళ్లే క్రమంలో కలెక్టర్‌ను బెండపూడిలో విమానాశ్రయం వద్దంటూ బాధిత రైతులు ప్లే కార్డులు పట్టుకుని, వారిని ఆపి మరల తమ గోడును వినిపించారు విమానాశ్రయం ఇక్కడ ఏర్పాటు చేయడం వలన తమకు జరిగే కష్టనష్టాలను వివరించారు. విమానాశ్రయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయకుండా వేరేచోటకు తరలించి రెండు పంటలు పండే పొలాలను కాపాడాలని కోరారు. రైతులు ఆందోళన చెందవద్దని, మీ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఎంపీకి ఘన స్వాగతం

ప్రజాశక్తి - పెద్దాపురం

అమెరికాలో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశంలో పాల్గొని తిరిగి వచ్చిన ఎంపి తంగేళ్ల ఉదయశ్రీనివాస్‌కు జనసేన శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కాకినాడ వెళ్తుండగా కుడా ఛైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట గుర్రాల సెంటర్లో బాణాసంచా కాలుస్తూ గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, కటారి శ్రీనివాస్, ఒబిలిశెట్టి గణేష్, త్రిపరగిరి చంద్రముఖి, కొప్పిరెడ్డి నాగబాబు, టిడిపి నాయకులు రంది సత్యనారాయణ, కొరిపూరి రాజు పాల్గొన్నారు.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని జెసి రాహుల్ మీనా ఆదేశించారు. సోమవారం పిఠాపురం రథాలపేట డాక్టర్ అంబేద్కర్ మల్టిపర్పస్ కమ్యూనిటీ హాల్లో పిజిఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు, మూడు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొనసాగిన క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

బకాయి జీతాలను చెల్లించాలని క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన ఆందోళన సోమవారం నాటికి 25వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న ఈ ధర్నా ను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ గౌరవా ధ్యక్షులు పలివెల వీరబాబు, సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, సిఐటియు నాయ కులు మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. పోరాటాన్ని చేపట్టి 25 రోజులైనా జీతాలు వేయక పోవడం అన్యాయమని అన్నారు. గ్రీవెన్స్‌లో కమిషనర్‌ను కలిసి జీతాలు కోసం అడిగితే 'బిల్లు పైకి పంపించాను. మీరు వెళ్లి అక్కడ ఆందోళన చేయండి. ఇక్కడ ఎందుకు ధర్నాలు చేయడం' అని మాట్లాడటం బాధాకరమని అన్నారు. బిల్లు పంపించడం కాదని తక్షణమే ఒక అధికారిని సిడిఎంఎకి పంపించి జీతాలు పడే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, శివశంకర్, దుర్గాప్రసాద్, భద్ర, వెంకటేష్, రమణ, శివ, రాజు, సూరిబాబు, రమణ, వెంకటేష్, భైరవ స్వామి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

హామీలను తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరావు మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, ఎస్‌సిలపై అత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలను వ్యతిరేకించిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేసేందుకు సిద్ధపడటం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని ఎంపిడిఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కెవివి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, జివిఎస్.రెడ్డి, డి సోమరాజు, వి గంగాధర్, ఏ.సుబ్రమణ్యం, వాసు, వెంకటలక్ష్మి, సునీత, విజయ్, డి చంద్రబాబు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజా సమస్యలపై సిపిఎం వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ రామకృష్ణకు సిపిఎం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వజన కళామండలి అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు, సిపిఎం నాయకులు వల్లు రాజబాబు, పులపకూర కృష్ణ, దుప్పి అదృష్టదీపుడు, ఎన్.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో అపార్ అప్‌డేట్ కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నాతి బుజ్జి సూచించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ విద్యార్థికి ఆటోమేటెడ్ పర్మిట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్టర్ అనే కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 2020 జాతీయ నూతన విద్యా విధానం కొరకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆధార్‌తో లింక్ చేయడం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 22వ తేదీ వరకూ గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు, పి.నాయకంపల్లి, సూరంపాలెం గ్రామాల్లో జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

జీతాల కోసం స్కూల్ ఆయాల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

తమకు రావలసిన 4 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్కూల్ ఆయాల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం ఆర్‌డిఒ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బర్ల నాగమణి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలగా తక్కువ వేతనానికి స్కూల్ ఆయాలుగా పని చేస్తున్నామన్నారు. తమకు రావలసిన వేతన బకాయిలు వెంటనే చెల్లించే ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వసంతల నాగమణి, క్రి లక్ష్మి, దాసరి నాగమణి, మందపాటి అన్నపూర్ణ, ఫాతిమా, సిఐటియు నాయకులు ఎస్ శ్రీనివాస్, నెక్కల నరసింహ మూర్తి, కూనిరెడ్డి అప్పన్న, దారపురెడ్డి కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆయాలు

108 ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కాకినాడ

108 ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద రిలే నిరహార దీక్షను సోమవారం చేపట్టారు. 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన ఈ దీక్షలో 108 వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అరబిందో యాజమాన్యం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటిని తక్షణం చెల్లించాలని, కాలం చెల్లిన వాహనాలు స్థానంలో నూతన వాహనాలు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జయరాం, అసోసియేట్ అధ్యక్షులు పివివి.సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా 108 నిర్వహణ కాంట్రాక్టర్లను మార్చడంతో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా ఎగ్గొడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, కోశాధికారి వరప్రసాద్, కమిటీ సభ్యులు తాతబ్బాయ్, నాగేంద్ర, సత్యన్నారాయణ, ప్రియాంక, సుందరమణి రిలే దీక్ష చేపట్టగా, ఎస్‌బి.కృష్ణంరాజు, నూకరాజు, దుర్గాప్రసాద్, భూరి నాగేంద్రప్రసాద్ ఇతర ఉద్యోగులు మద్దతు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న 108 ఉద్యోగులు

ఘనంగా సోమసుందర్ శత జయంతి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణానికి చెందిన ప్రముఖ వజ్రా యుధ కవి ఆవంత్స సోమసుందర్ శత జయంతి వేడుకలు స్థానిక సూర్యారాయ గ్రంథాలయంలో సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలు వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజ హితవు కోరి యువకులలో ఉద్యమ స్ఫూర్తి నింపే రచనలు ఎన్నో చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాస్, సతీష్, ప్రముఖ కవి మేక మన్మధరావు, శ్రీకృష్ణదేవరాయ, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలి

ప్రజాశక్తి - పిఠాపురం

పాదగయలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలని దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు ఆలయ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన క్షేత్రాన్ని సందర్శించి తనిఖీలు చేపట్టారు. పారిశుధ్య నిర్వహణపై ఆసంతృప్తి వ్యక్తం చేశారు. దర్శనాలకు వచ్చే భక్తుల పట్ల సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలన్నారు. పాదగయ పుష్కరిణి పరిశుభ్రంగా ఉంచాలని, అందులో వేసే పూజా సామాగ్రి, అరటిదొప్పలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పాదగయ ఇఒ కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

కార్టూ'నిజం'



అర్జీలను సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల నుంచి అందుకున్న అర్జీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారు లకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, డ్రెయిన్స్, కాలువల్లో పూడిక తొలగింపు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణలు తొలగింపు వంటి అంశాలకు చెందిన మొత్తం- 314 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో నమోదు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాలలోని హౌసింగ్ లేఅవుట్లను విధిగా పర్యటించాలని ఆయన సూచించారు . హౌసింగ్ లేఔట్ లో గృహాలు త్వరిత గతిని నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి. సత్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెఆర్‌సి జి.రత్నమణి, కెఎస్ఇజెడ్ ఎస్‌డిసి రామలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెన్షన్‌దారులు

ఇపిఎస్ పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పిఎఫ్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. యూనియన్ నాయకులు కె.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్యాలయ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి టి.రామదాసుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు జోగా అప్పారావు, యుఎస్‌ఎన్.రెడ్డి క్రి బాబురావు, క్రి నాగేశ్వరరావు, పివి.రమణ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలి

ప్రజాశక్తి - కోటనందూరు

ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్‌ను వాడాలని ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. సోమవారం కోటనందూరు-కాకరపల్లి గ్రామాల ప్రధాన కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయణిస్తున్న వారికి హెల్మెట్ యొక్క అవసరతను వివరించారు. వాహనాలకు రికార్డులు, నెంబర్ ప్లేట్లు సక్రమంగా లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వధూవరులకు పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటకు చెందిన చింతపల్లి అనంతలక్ష్మి కుమార్తె చింతపల్లి దుర్గాభవాని, కోట వీర వెంకటసత్యనారాయణ దంపతులకు నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెళ్లి కానుకను అందజేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఫౌండర్ జ్యోతుల నవీన్‌కుమార్ చేతుల మీదుగా ఈ చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు తమ ఫౌండేషన్ ద్వారా ప్రకటించిన పెళ్లి కానుక హామీని కొనసాగిస్తున్నామని, ఇప్పటి వరకూ 49 మందికి పెళ్ళికానుకను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిశెట్టి భద్రం, అడబాల వెంకటేశ్వరరావు, గద్దె మారుతి, పైలా శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఐదేళ్ల చిన్నారిపై 24 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి యత్నించిన సంఘటన ఇది. దీనికి మండలంలోని ఒక గ్రామంలో ఐదేళ్ల బాలికను సోమవారం పక్కింటికి చెందిన 24 ఏళ్ల యువకుడు తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికను గదిలోకి రప్పించి అసభ్యంగా ప్రవర్తించాడు. లైంగిక దాడికి ప్రయత్నించాడు. చిన్నారి కేకలు వేయడంతో చిన్నారి తల్లి పరుగున వెళ్లి జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువకునిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె ప్రసాద్ తెలిపారు.

కాలువలో బాలుడు గల్లంతు

ప్రజాశక్తి - దేవరపల్లి

ఆదివారం సెలవు దినం కావడంతో పోలవరం కుడికాలువలో ఏడుగురు విద్యార్థులు ఈతకు వెళ్లారు. వీరిలో పాముల గౌతం(13) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. విద్యార్థులంతా దేవరపల్లి ప్రభుత్వ పాఠశాలలోని ఏడో తరగతి చదువుతున్నారు. విద్యార్థి గల్లంతైన విషయం తల్లిదండ్రులకు, బంధువులకి తెలపకుండా మిగతా విద్యార్థులు గోప్యంగా ఉంచారు. గౌతమ్ ఆచూకీ తమకు తెలియదని సమాధానం ఇవ్వడంతో రాత్రంతా కుమారుని కోసం వారు గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకొన్న పోలీసులు రంగంలోకి దిగారు. గజ ఈతగాళ్లతో కాలవలో గాలింపు చర్యలు చేపట్టారు.

సారా బట్టీపై దాడి : వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

సారా బట్టీపై పోలీసులు దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని కె.గోపాలపురం గ్రామానికి చెందిన జి.అప్పన్న సారా తయారు చేస్తుండగా దాడి చేసి అరెస్టు చేశారు. అతని వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 200 మీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని, ఆ ముద్దాయిని సబ్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి - జగ్గంపేట

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి 2 రోజుల జైలు శిక్షతోపాటు, రూ.10 వేలు చొప్పున పెద్దాపురం మెజిస్ట్రేట్ జరిమానా విధించారని సిఐ వైఆర్‌కె. శ్రీనివాస్ తెలిపారు. స్థానికంగా సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి శిక్షతోపాటు, జరిమాన విధించారని వివరించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఆరుగురికి రూ.600 చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

2,700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం, కాండ్రకోట గ్రామాల్లో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఎస్ఎస్ఎస్.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన రఘుదేవపురంలో చోటు చేసుకుంది. ముగ్గళ్ళ గ్రామానికి చెందిన మిరప శ్రీను రఘుదేవపురం రవిచంద్ర కాలనీ వెనుక పంట పొలానికి సోమవారం నీటితడి పెడుతున్నాడు. ఈ సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సీతానగరం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాము కాటుతో బాలుడు మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

పాముకాటుకు గురై ఏడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన నల్లజర్ల మండలం సింగరాజుపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నల్లజర్ల గ్రామానికి చెందిన బోయపాటి సాగర్, కవిత భార్యాభర్తలు. వారికి బోయపాటి ధనుష్(7) కుమారుడు ఉన్నాడు. ఆదివారం సింగరాజుపాలెంలో పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆరుబయట బాణసంచా కాలుస్తుండగా తాచు పాము ధనుష్ కాలిపై కాటు వేసింది. వెంటనే ధనుష్‌ను తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మార్గం మధ్యలోనే మృతి చెందాడు.

శ్మశానం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎస్‌సి శ్మశాన వాటికి ఆక్రమణలపై మానవహక్కుల సంఘం జిల్లా నాయకుడు నూతలపాటి అప్పలకొండ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వారి కోసం ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక ప్రాంతంలో తాగేసిన కొబ్బరి బొండాలు, గృహాల రబ్బీస్‌ను వేస్తున్నారని, అనేక మంది గడ్డి వాములు వేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారని అన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు కుంచే నానిబాబు, జుత్తుక అప్పారావు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి

హౌసింగ్ లే అవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ నాతి బుజ్జి ఆదేశించారు. సోమవారం మండలంలోని తాళ్ళూరు, నీలాద్రిరావుపేట గ్రామాల్లో పర్యటించి ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. రూఫ్ లెవెల్, రూఫ్ స్లాబ్ లెవెల్‌లో ఉన్న లబ్ధిదారులు ఈ ఏడాది డిశంబర్ 31, లోగా, మిగిలిన లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి 31లోగా ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. ఈ పర్యటనలో హౌసింగ్ ఎఇ బి.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి తరంగిణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

అవగాహనా సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

సూరంపాలెం ఆదిత్య యూని వర్సిటీలో ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు, విద్యారంగం-పరిశ్రమ మధ్య ఉన్న విభేదాలు' అనే అంశాలపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో నిపుణులు శ్రీనివాస్ యామ్జుల, మోడెర్నా మాజీ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఆసిఫ్ బాషా, ఐ.క్యాడ్రా సిఇఒ వెంకట్ మాచవోలు ఆయా అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథుల బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో-చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫ్రెష్మాన్ ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.వానతి పాల్గొన్నారు అలాగే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైనన్ లెక్చర్ కార్యక్రమం జరిగింది. 'ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో తాజా పరిశోధన ప్రవృత్తులు' అనే అంశంపై జరిగిన ఈ లెక్చర్‌లో రిసోర్స్ పర్సన్ డాక్టర్ వి.శ్రీనివాస రావు, డాక్టర్ కె.బాపయ్య నాయుడు డాక్టర్ ఎన్.రాంబాబు వివరించారు. ఈ లెక్చర్ కార్యక్రమం గత వారం రోజులుగా ప్రతీ రోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ నిర్వహించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్స్ డాక్టర్ ఎంబి. శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, అలా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ. వీరాంజనేయులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యను అలవర్చుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి - తొండంగి

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రతి విద్యార్థి సాంకేతికతో కూడిన విద్యను అలవర్చుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. సోమవారం మండలంలోని బెండపూడి హైస్కూల్లో స్టింకరింగ్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ విద్యను అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. స్టార్ఫెచ్ ఇన్నోవేషన్స్ సంస్థ నిర్వహిస్తున్న "పంచ్ పతాకా ఛాలెంజ్ ఎగ్జామ్"ను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చూపించారు. రోబోటిక్స్ వంటి సాంకేతిక విభాగాల్లో విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా, వారు భవిష్యత్ ప్రపంచానికి సన్నద్ధం అవుతారని అన్నారు. ఈ ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులకు వివిధ శిక్షణా కార్యక్రమాలు, ప్రాక్టీస్ ఎగ్జామ్‌లు, మరియు పరీక్షల విశ్లేషణలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతున్నట్లయితే జిల్లాలోని అన్ని పాఠశాలల్లోనూ ప్రవేశపెట్టాలని డిఇఒను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ పిల్లి రమేష్, జిల్లా సైన్స్ అధికారి మైలపల్లి శ్రీనివాస్ వినీల్, స్టార్ఫెచ్ ఇన్నోవేషన్స్ వ్యవస్థాపకులు అవనిగడ్డ రఘువంశీ, సహ వ్యవస్థాపకురాలు కాకరపల్లి దివ్యశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధుమేహ రోగులకు ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి - శంఖవరం, తాళ్లరేవు

శంఖవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లయన్స్ క్లబ్ ఆఫ్ సత్యదేవ అన్నవరం సహకారంతో మధుమేహ రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. సోమవారం బస్సు కాంప్లెక్స్ ఆవరణలో సత్య మారుతి ఆసుపత్రి వైద్యరాలు డాక్టర్ సృజన మధుమేహ రోగులకు పరీక్షలు చేసి షుగర్ వ్యాధి పట్ల పాటించవలసిన ఆహార నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్థానిక వాసు క్లినికల్ ల్యాబ్ నిర్వాహకులు వాసు రోగులకు షుగరు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిధులు దొంకాడ గిరి, ఎం.నాగేశ్వరావు, సత్యనారాయణ, పి సూరిబాబు, టివి.సత్యేంద్ర, వాసు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరంలో సోమవారం ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. మెడో ఫార్మా కంపెనీ సహకారంతో వైద్యులు విఆర్ఎన్‌బి.ప్రసాద్ ఆధ్వర్యంలో పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మా కంపెనీ ప్రతినిధులు షణ్ముఖ, సురేష్, రవితేజ, వెంకటేష్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ డ్రైవర్స్‌కు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కార్మికుల సమస్యలపై అధికారికి వివరిస్తున్న వీరబాబు

కాకినాడ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో మంచినీటి సరఫరా ట్యాంక్ డ్రైవర్స్‌కు చెల్లించాల్సిన 3 నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని సిఐటి యు నాయకులు కోరారు. సోమవారం నగర పాలక సంస్థలో జరిగిన పిజిఆర్ఎస్ కార్య క్రమంలో సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల జీతాలు నేటికీ మంజూరు కాలేదన్నారు. నవంబర్ 4న గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా సంబంధిత సెక్షన్ అధికారులు బిల్లు తయారు చేశామని చెప్పినా ఆచరణలో కార్మికులకు జమ కాలేదన్నారు. జీతాలు రాక అద్దె ఇంటి యజ మానులు ఇల్లు ఖాళీ చేయమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ పవన్, మల్లీశ్వరరావు, నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మికుల ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

వివిధ కంపెనీలకు చెందిన కార్మికులతో నిర్వాహకులు

స్థానిక ఎడిబి రోడ్డులో ఉన్న పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు సోమ వారం స్థానిక మహారాణి కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆటల పోటీలు ప్రారంభించారు. రాక్ సిరామిక్స్, దేవి సీ ఫుడ్స్, శ్రీ గిరిజ అల్లోయ్ అండ్ పవర్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, నెక్కంటి సీ ఫుడ్స్, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, పట్టాభి అగ్రో ఫుడ్స్, ఎలైట్ ఇన్స్ట్రుమెంట్స్, అపెక్స్ ఫ్రోజన్ ఫుడ్స్ సంస్థల ఆధ్వర్యంలో ఇండస్ట్రీస్ స్పోర్ట్స్ మీట్ - 2024 నిర్వహిస్తున్నాయి. ఈనెల 21వ తేదీ వరకూ నిర్వహించే ఈ స్పోర్ట్స్ మీట్‌లో మహారాణి కళాశాల గ్రౌండ్లో క్రికెట్, వాలీబాల్, చదరంగం పోటీలు నిర్వహిస్తారు. స్థానిక బచ్చు గురుమూర్తి మున్సిపల్ ఆడిటోరియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిం చబడతాయి. ఈ పోటీల ప్రారంభ సభలో ఆయా పరిశ్రమల ప్రతినిధులు టి.నీరజ్‌కుమార్, డాక్టర్ వివివి.శేషగిరిరావు, వినోద్, చెల్లదురై, బాలాజీ, విజిఎస్.కుమార్, రవీంద్రనాథ్, అనిల్, హెచ్ఆర్.శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రవి,సురేష్, ఎస్ఎస్.రావు, గోపీచంద్, అచ్యుత్, గాంధీ, మణికంఠ, రవీంద్ర, లక్ష్మణ్, కృష్ణ, గిరిధర్ పాల్గొన్నారు.

ప్రయివేటు వసతి గృహాల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం, రామేశ్వరంపేటలో ఉన్న ప్రయివేటు బాలికల వసతి గృహాలను డిఎస్‌పి శ్రీహరిరాజు సోమవారం పరిశీలించారు. వసతి గృహల పరిసర ప్రాంతాలలో విసిబుల్ పోలీసింగ్ నిర్వహించి, హాస్టల్లో ఉంటున్న విద్యార్థునులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీహరిరాజు హాస్టల్లోని పరిసరాలను పరిశీలించి, సేఫ్టీ అండ్ సెక్యూరిటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు పోలీస్ పరంగా పూర్తిస్థాయిలో భరోసా భద్రతను కల్పించారు. సెక్యూరిటీ ఫీచర్స్‌పైన, సిసి కెమెరాలు ఏర్పాటు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా మహిళా రక్షక్ కార్యక్రమంపై విద్యార్థినులకు వివరించారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ యువి.శివనాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి జెండా చొక్కా వేసుకున్నాడని...

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వైసిపి జెండా చొక్కా వేసుకున్న వ్యక్తిపై జనసేన కార్యకర్త దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అమీనాబాద్‌కు చెందిన గంట శ్రీను వైసిపి జెండా కల్గిన చొక్కాను ధరించి ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్‌కు ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో వచ్చాడు. అక్కడే ఉన్న జనసేన పార్టీకి చెందిన రాజు అనే వ్యక్తి వైసిపికి చెందిన చొక్కాను తీసేయాలని అన్నాడు. దీనికి శ్రీను నిరాకరించాడు. ఎందుకు తీసేయాలని నిలదీశాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో జనసేనకు చెందిన రాజు ఇటుకతో శ్రీనుపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనును స్థానికులు పిఠాపురం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శ్రీను తెలిపారు.

సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెదపూడి

గ్రామాల్లో చేపట్టిన కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ కొవ్వూరి నరేంద్రరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్యం చర్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలన్నారు. ఇంటి పన్నులు వసూలు, సర్వేలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రతిరోజు అధికారుల అటెండెన్స్ పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి మేడపాటి సత్య నారాయణరెడ్డి, ఎపిఒ సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ, అలాగే 26 నుంచి 29వ తేదీ వరకూ ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారితోపాటు, ఆధార్ నమోదు పూర్తయి కార్డు రాని వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తారని, 2010 నుంచి 2016 మధ్యకాలంలో ఆధార్ కార్డు తీసుకుని అప్‌డేట్ చేయించుకోని వారు, ఇతర ఆధార్ సంబంధిత సేవలు ఈ శిబిరాల్లో నిర్వహిస్తారని తెలిపారు. ఆయా పంచాయతీలలోని సచివాలయాల వద్ద ఏర్పాటు చేసే ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవిత పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక భవిత పాఠశాలకు సోమవారం వాటర్ ప్యూరిఫైని జగ్గంపేటకి చెందిన పురాణపండ సత్యనారాయణమూర్తి హరి కుసుమాంబ చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం సందర్భంగా అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు పురాణపండ శేషసాయిశర్మ చేతులమీదుగా వాటర్ ప్యూరిఫైని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అప్పన పెద్దకాపు ట్రస్ట్ నిర్వహాకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

57వ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం స్థానిక శాఖ గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు పి.రామచంద్రరావు, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం కార్యదర్శి కె.శంకర్రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్ వెంకట రాము, పాఠకులు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** ఉప్పాడ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలతోపాటు, పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నళినీప్రియ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు నూకరాజు, మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం ఎంఎల్.శివజ్యోతి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది బుల్లియ్య, మరియమ్మ పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కవికొండల సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎ.సుధీర్, స్వామి, విజయ పాల్గొన్నారు. **కరప** మండలంలోని వేళంగి గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే జనరల్ స్టడీస్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.రంగయ్య, ఉపాధ్యాయురాలు ఎం.సుజాత, ఎర్ర విక్రమ్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీ రామారావు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థాని శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బందిల రత్నామణి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హనుమంతరావు, బాల మురళి, మణికంఠ, శ్రీనివాసు వ్యవహరించారు. **గొల్లప్రోలు** స్థానిక మలిరెడ్డి సరస్వతి మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంవిఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు కుర్ర నారాయణరావు, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, సభ్యులు మలిరెడ్డి నారాయణరావు, మలిరెడ్డి సత్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు. **పెదపూడి** స్థానిక శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ అధికారి కృష్ణవర్ధన్, పాఠకులుపాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జట్లు, లేబర్, హమాలీ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పామాయిల్ తోటలో జి.బాబు రావు అధ్యక్షతన జరిగిన జట్లువర్కర్స్ యూనియన్ మహాసభలో ఆయన మాట్లాడారు. జట్లు వర్కర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా ఈ విభాగంలోని కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందించవచ్చున్నారు.కార్మికులు బరువులు మోయటం వల్ల వృద్ధాప్యం రాకుండానే అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. జట్లు కార్మికులకు ఇఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు.

నూతన అధ్యక్షునిగా రామకృష్ణ

జట్లు వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షునిగా యాకా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా నారపాటి వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా కన్నూరి వీర వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా సర్వశుద్ధి వీరబాబు, కోశాధికారిగా రాయుడు శ్రీను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బుట్టా త్రిమూర్తులు, బొడ్డు శ్రీను, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, యు.కొత్తపల్లి మండలం, పాత ఇసుకపల్లి గ్రామం గ్రామ కాపురాస్తుడైన దడాల నాగ వెంకట సత్యనారాయణ, తండ్రి దడాల బాలరాజు ది. 13-11-2024వ తేదీన పాస్‌పోర్ట్ నెం. **L9661351** రెన్యూవల్ నిమిత్తం పాత ఇసుకపల్లి నుండి యు.కొత్తపల్లి వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయింది. ఎవ్వరికైనా దొరికిన యెడల ఈ క్రింద అడ్రస్‌కు తెలియజేయగలరు.

నా అడ్రస్:
దడాల నాగ వెంకట సత్యనారాయణ
తండ్రి: బాలరాజు, పాత ఇసుకపల్లి గ్రామం
యు.కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా.
సెల్ నెంబర్: 9573252903

ప్రకటన

కీ॥శే॥ శ్రీ **బండారు నాగభూషణం** (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, విలసవిల్లి గ్రామ కాపురస్తులు బండారు వెంకట దుర్గారావు, S/o. నాగభూషణం (లేటు) గారి కుమారుడు బండారు వెంకట దుర్గారావు గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తండ్రి గారు **బండారు నాగభూషణం** విలసవిల్లి గ్రామంలో మా ఇంటి వద్ద 06-2-2009 సం॥రంలో మరణించారు. వీరి మరణం గ్రామపంచాయతీలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **బండారు వెంకట దుర్గారావు**
S/o. నాగభూషణం, డోర్ నెం. 4-27
విలసవిల్లి గ్రామం, ఉప్పలగుప్తం మండలం
సెల్: 99514 14599

ప్రకటన

కీ॥శే॥ శ్రీమతి **బండారు వీరవేణి** (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, విలసవిల్లి గ్రామ కాపురస్తులు బండారు వెంకట దుర్గారావు, S/o. నాగభూషణం (లేటు) గారి కుమారుడు బండారు వెంకట దుర్గారావు గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తల్లి గారు **బండారు వీరవేణి,** W/o. నాగభూషణం, విలసవిల్లి గ్రామంలో మా ఇంటి వద్ద 28-3-2009 సం॥రంలో మరణించారు. వీరి మరణం గ్రామ పంచాయతిలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **బండారు వెంకట దుర్గారావు**
S/o. నాగభూషణం, డోర్ నెం. 4-27
విలసవిల్లి గ్రామం, ఉప్పలగుప్తం మండలం
సెల్: 99514 14599

బహిరంగ ప్రకటన

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలం, మండపేట, డోరు నెం. 34-19-10/3 కాపురస్తులు పెంజర్ల నాగ వీరవెంకట సత్య సూర్య వినాయక వరప్రసాద్ గారి భార్య పెంజర్ల పద్మ నాగేశ్వరి అను నేను ప్రమాణముపై దాఖలు చేసుకున్న అఫిడవిట్ కమ్ ఇండెమినిటీ బాండు సంగతులు ఏమనగా,

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలం, మండపేట గ్రామం తాలూకు స్థిరాస్తికి సంబంధించిన క్రయ దస్తావేజుకు ద.నెం. 1876/2020 రుకు గల లింకు క్రియ దస్తావేజు నెం. 1406/2002 రు మిస్ అయినది. మల్లాడి ప్రభాకరరావు వగైరాల వల్ల క్రియం పొందినటు వంటి క్రియ దస్తావేజు అయి వున్నది. సదరు ద.నెం. 1876/2020రుకు లింకు దస్తావేజు అయి వున్నది. సదరు పైన వివరించబడిన లింకు క్రియ దస్తావేజును పోగొట్టుకున్న విషయమును గురించి పోలీసు వారికి కంప్లైంట్ చేయడం కూడా జరిగినది. కనుక సదరు పై విషయములు అన్నియూ యదార్థములు నియూ, సదరు విషయములు భవిష్యత్తులో అవాస్తవములని తెలియవచ్చిన యెడల మీరు నాపై జరిగించు చట్టపరమైన చర్యలకు మరియు ఐ.పి.సి. 199/200రు ప్రకారం నాపై మీరు తీసుకొని చర్యలకు నేను పూర్తి బాధ్యత వహించగలనని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

ఎస్.తాతారెడ్డి, అడ్వకేట్ / నోటరీ
రామచంద్రాపురం రామచంద్రాపురం
18-11-2024 సెల్: 9866960337

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
ARBEP No30/2023
A.C.No.461/2016

Between:
Ms.Shriram Finance Ltd., (Formerly known as Shriram Transport Finance Company Ltd.) Rajahmundry Branch, Rep by it GPA Holder, SaiSubrahmanyam R/o.Rajahmundry ...Dhr
And
Biruduganti Uaday Kumar and others ...JDRs
1. Biruduganti Uaday Kumar, S/o. Narasimha Rao, Aged 48 years, Business, D.No.1-2-28R/32/R, Indira Park X Road, Hyderabad, Talanga State. ...1stJDr

పై నెంబరు E.P. లో 1వ JDr అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు Or 21, Rule 22 CPC ప్రకారం నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **19-11-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై E.P. లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు E.P. ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పురంశెట్టి సత్యరమేష్
అడ్వకేటు,రాజమండ్రి

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆదుర్రు
మామిడికుదురు మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
టెండరు ప్రకటన

ఆ.క. నెం.2/2024 తేది.18-11-2024

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, ఆదుర్రు గ్రామపంచాయతి 2024-25 సంవత్సరమునకు ఈక్రింది షెడ్యూలు దాఖలా పనులకు సీల్డు టెండర్లు ఈక్రింది సంతకం చేసిన వారిచే ది. 22-11-2024వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.00 గం॥లకు స్వీకరించబడి, అదేరోజు మధ్యాహ్నం గం॥ 2.30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండర్లుకు డిపాజిట్ షెడ్యూల్‌లో చూపిన విధముగా రుసుము చెల్లించి దాఖలు చేయవలెను.

వ.నెం.	వివరములు	ధరావత్తు
1	ఆదుర్రు గ్రామపంచాయతి ఆవరణలో ఆర్.సి.సి. కాంక్రీట్ బ్రిక్స్‌తో ఫ్లోరింగ్ నిర్మాణం చేయుట గురించి Bit: I అంచనా - 2 లక్షలు	10,000/-
1	ఆదుర్రు గ్రామపంచాయతి ఆవరణలో ఆర్.సి.సి. కాంక్రీట్ బ్రిక్స్‌తో ఫ్లోరింగ్ నిర్మాణం చేయుట గురించి Bit: II అంచనా - 2 లక్షలు	10,000/-

సదరు పనులకు సొమ్ము పంచాయతి నిధులను బట్టి ప్రయారిటీ పద్ధతిలో చెల్లించబడును.

సం/- **బళ్ళ శ్రీనివాసరావు**
సర్పంచ్, గ్రామపంచాయితీ, ఆదుర్రు
మామిడికుదురు మండలం

సం/- **బి.వి.వి.సత్యనారాయణ**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
ఆదుర్రు, మామిడికుదురు మండలం

మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన 7వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.184/2024

పార్టీలు:
బళ్ళ జగదీశ్వరరావు (రిప్రజెంటెడ్ బై జనరల్ పవరాఫ్ అటార్ని హౌల్డరు, బండారు వెంకటేశ్వర రావు) ...వాది
మరియు
తమ్మన సూర్య వినోద్, ...ప్రతివాది
తమ్మన సూర్య వినోద్ (తండ్రి) వెంకటరామగుప్త హిందువు, వయస్సు 41 సం॥లు, డోరు నెం. 7-26, మురమండ, కడియం మండలం తూర్పుగోదావరి జిల్లా. ...ప్రతివాది

పై వాది మీరు వ్రాసిన తనఖా దస్తావేజును పురస్కరించుకొని ప్రిలిమినరీ డిక్రీ జారీ చేయమని దాఖలు చేసిన పై దావా మీ హాజరుకు గాను పై కోర్టులో ది.**11.12.2024**వ సం.రం. తేదీకు వాయిదా అయి వున్నది. కావున మీరు పై కోర్టు ఎదుట ది.**11.12.2024**వ సం.రం. తేదీ ఉదయం గం.**10-30** ని॥లకు గాని స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలియపర్చుకోగలరు. లేని యెడల పై దావానుమీ పరోక్షమున నిర్ధారింపబడును.

యమ్.ఆర్.సత్యసాయి(రాంబాబు)
పిటిషనర్ తరపున అడ్వకేట్.
డోరు నెం.86-11-11/1
వాడ్రేవునగర్, తిలక్ రోడ్డు, రాజమండ్రి

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 690/2022

Between:
Nambathula Prabakaram ***...Petitioner/ Petitioner***
AND
Thirumalanadhuni Rajababu and Others ***...Respondents***
1. Thirumalanadhuni Rajababu, S/o. Kondalarao, Hindu, aged 38 years, Driver cum Owner of the Goods Auto, bearing No. AP 05 W 7088, R/o. D.No. 1-192, West Ganugudem, Korukonda, E.G.Dist., 533289. ***...1st Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 02-12-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.సతీష్‌కుమార్
రాజమండ్రి **జి.అంబికా ప్రసాద్**
09-11-24 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 291/2023

Between:
Bogireddy Nageswara Rao ***...Petitioner/ Petitioner***
AND
Dola Dilli Naidu and Others ***...Respondents***
1: Dola Dilli Naidu, S/o. Dola Ramu, Hindu, aged 27 years, Driver of the crime vehicle Auto bearing No. AP 16 TL 1233, R/o. D.no. 18-171, Siddi Nagar, Sanath Nagar, Kanuru, Penamaluru, Krishna Dt., ***...1st Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 28-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.సతీష్‌కుమార్
రాజమండ్రి **జి.అంబికా ప్రసాద్**
05-11-24 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 136/2023

Between:
Buddiga Janardhana ***...Petitioner/ Petitioner***
AND
Chippada Madhu Kumar,S/o. Suryanarayana and Others ***...Respondents***
R-2: Palli Nageswara Rao, S/o. Appa Rao, aged 55 years, Owner of the Eicher Van crime vehicle bearing No. AP 16 TS 7667, R/o. D.No. 3-223, Ganesh Nagar, Rajamahendravaram, E.G.Dt., RJCJ. ***...2nd Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 02-12-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.సతీష్‌కుమార్
రాజమండ్రి **జి.అంబికా ప్రసాద్**
09-11-24 అడ్వకేట్స్, రాజమండ్రి